పెరిగిన అడవిగుండా ఎత్తుకుపోతాడు. ఇవన్నీ కలసి వీరయ్యను తెరమీద స్పష్టంగా అగుపడకుండా చేశాయి. వీరయ్య సంభాషణలు పల్లించినచోట సౌండ్ ఫెయిలైంది. దీన్ని పురస్కరించుకొని చాలమంది వీరయ్య ఫంక్ కొట్టాడని విమర్శించారు. వీరయ్య పేరు 'టైటిల్స్'లో 'వీరకుమార్' అని ఉంది. దీన్ని ఇట్టి టైటిల్స్‌లో అసలు వీరయ్యపేరే లేదని చాలమంది తమ దృఢఅభిప్రాయాన్ని ప్రకటించారు. తండ్రి రామదాసుకు, మిత్రుడు శేషయ్యకు ఇదే అనుమానం వచ్చింది. దీనికి వీరయ్య ఏమి చెపితేమాత్రం ఏం లాభం. "చిత్రం కథ లేకపోవటంవల్ల దెబ్బ తినిందని" కొందరు, "సంగమేశం సంగీతం శ్రావ్యంగా లేకపోవటం చిత్ర పరాజయానికి దారితీసిందని" కొందరు, "నటీనటులు అతిచచ్చుగా నటించటంవల్ల చిత్రం ఫెయిలైందని" కొందరు, "పాటలు హిట్స్ అయ్యేటివి లేవని, ప్రత్యేకాకర్షణలు చెప్పకోటానికి ఏమీ లేవని" కొందరు పలురకాల విమర్శించారు. ఏది యేమైనా చిత్రం పూర్తిగ దెబ్బతినింది. మరునటిరోజే దినపత్రికల్లో "వీరనారి ప్రొడక్షన్స్ దివాలా తీసిందని" తాజావార్త ఒకటి వచ్చింది.

ఇదంతా అదృష్టం కలిసిరాకపోవటంవల్ల జరిగిందని వీరయ్య బాధపడ్డాడు. తండ్రి రామదాసుకు ఒక్కటే దిగులు పడిపోయింది. "తాకట్టుపెట్టిన ఒక్కగానొక్క ఇంటిని విడిపించుకోటానికి రెండువేలరూపాయలు ఎక్కడనుండి తేవటమా ?" అని.

(కేవలం కల్పితం)

★



భార్గవి ఫిలిమ్సువారి "మృత్యువుని జయించిన మానవుడు"లో అభినేత్రి కృష్ణకుమారి.

# అష్టమినాటి అతిథి ★

రచన : సాధనాల నారాయణస్వామి

చాలీచాలని జీతంతో ముగ్గురు పిల్లలతో కాలక్షేపం చేస్తున్న రోజులవి. వచ్చే తొంభయి రూపాయిలు ఇరవయ్యో తారీఖుతో అఖరు. మర్నాటినుంచి పక్కింటి ధర్మారావు దగ్గరో ప్రకాశరావుదగ్గరో అప్పుకు తయారు. ఇట్లూ వుంటూ వుండగా.

ఓరోజున సాయంకాలం....అవేళ అష్టమి అనుకుంటాతిథి .... మా అత్తగారి అన్నగారి బావమరది బెడ్డింగూపెట్టె వేసుకొని దిగాడు, కోర్టులో ఏదో వాయిదావుందంటూ....రాకరాక వచ్చాడు కదా అమ్మగారి తరవుచుట్టంఅని మాకనకరత్నం, ఆర్భాటంగా మూడు నాలుగురకాల కూరలు అప్పడాలు దప్పళాలు వగయిరాలు వేసి వడ్డించింది.

"నీముందు నలుడూ భీముడూకూడా తీసికట్టే నమ్మాయీ కనకరత్నం అంటూ లేచి చెయ్యికడిగాడు.

రెండో రోజుకూడా అదేప్రకారం, తేడా లేకుండా నడ్డించింది కనకరత్నం. "బ్రేవ్"మని తేన్చుకుంటూ కోర్టుకుపోయాడాయన. ఇట్లాగే రెండు రోజులు గడిచినాయి. "చెరువు పక్క భూమి బేరానికి వచ్చింది బేరంచేసుకు వెళ్తానమ్మాయ్" అంటూ యింకో వారం రోజులు మా యింట్లోనే అతిధ్యం తీసుకున్నాడు, అష్టమినాడు వచ్చిన అతిధి.

అసలే జీతంచాలక, అన్నీ ప్రియమైపోయి తగలబడుతున్న రోజుల్లో యీాయన వ్యవహారం మాకేమీ నచ్చలేదు. కోర్టుపని అయిపోయింది. భూమి బేరంకూడా అయిపోయింది కాని మా అతిధిమాత్రం మాయిల్లు కదలలేదు.

ఓ రోజున "యీ వూళ్లో రెండుచింతల సుబ్రహ్మణ్యంగారి అబ్బాయి బియ్యే పాసయాట్ట, అమ్మాయికి సంబంధం ఏమైనా కుదురుతుందేమో చూడాలమ్మా కనకరత్నం' అన్నాడు. యీమాట వినగానే మా యిద్దరి గుండెల్లో రాళ్లుపడ్డాయి. మాకొంప ఆరిందన్న మాటే, వాళ్ల అమ్మాయికి సంబంధం స్థిరపడ్డం ఎలాగున్నా, మాకొంప గుండమవటం మాత్రం స్థిరం అవుతుంది.

ఈ అష్టమినాటి అతిథీగ్రహాన్ని "ఎలాగ వదలించుకోవాలా అన్నది "ఇండియా చైనా బోర్డరు" సమస్యకంటే పెద్దదయి పోయిందిమాకు, కనకరత్నం విసుక్కుంటున్నా, కసురుకుంటున్నా, పిల్లలమీద కోపంచూపిస్తున్నా కూడా ఆయన లెక్కచేయటం లేదు, దూషణ భూషణములు శరీరానికేగాని అత్మకి లేవన్నట్లు, పైగా పిల్లలతో యింతేనమ్మా! విసుక్కోకూడదు. పాపం—పిల్లలకేంతెలుసూ" అంటూ మాకే బుద్ధులుచెప్పటం ప్రారంభించాడు.

ఎన్ని లోట్లుచేసినా సరే, అయన లెఖ్ఖ చేయటంలేదు. భోజనం మధ్యాహ్నం రెండుగంటలకి వడ్డించినాసరే మాట్లాడకుండా భోజనంచేయటం మొదలుపెట్టేడు. పిల్లలతో కష్టంగా లేదమ్మా? ఇంటిడు పనితో నలిగిపోతున్నావు. ఓపనిమనిషిని చూస్తానుండు. అంటాడేగాని తిరుగు ప్రయాణం మాటమాత్రం ఎత్తడు. మా ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరు అయినాయి మా అష్టమినాటి అతిథిముందు.

ఓరాత్రంతా ఆలోచించాం దీనికి మందు ఏమిటా అని. మా కనకరత్నం ఒక ఉపాయం చెప్పింది. "వాళ్లావిణ్ణిగురించీ, వాళ్లమ్మాయిని గురించీ జ్ఞాపకంచెయ్యండి. అప్పుడు యింటిమీద దృష్టితిరిగి జెండా యెత్తుతాడు అంది. సరే....యిది బాగానే వుంది అనుకున్నా.

మర్నాడు కాఫీలు తాగేటప్పుడు ఈప్రస్తావనతెచ్చా.

మీరువచ్చి ఓనెల దాటినట్లుంది, యింటిదగ్గర అత్తయ్యగార్కి యిబ్బందిగా వుందేమో" అని అగాను అర్థంచేసుకుంటాడు కదా అని.

ఏమీ తడుముకోకుండా కుండపగలకొట్టినట్టు జవాబిచ్చాడు మా అష్టమినాటి అతిథి—

అదే ఆలోచిస్తున్నానబ్బాయి....మీ అత్తయ్య అక్కడ, నేనుయిక్కడ ఏమి బాగాలేదు. రేపే వెళ్లి మీ అత్తయ్యాని, అమ్మాయి నిర్మలని తీసుకువచ్చేసి, ముగ్గురం యిక్కడే నాలుగు రోజులపాటుండి, అమ్మాయి పెళ్లిసంబంధం తేల్చిపారేద్దామని అనుకుంటున్నా, ఏమంటావు ?" అన్నాడు.

నాచేతిలో కాఫీగ్లాసు జారిపడి 'టఫీ'మంది.

★